# వంచన



కిరణ్ కుమార్

సాయంత్రం నాలుగు గంటలయింది.

లెడ్జెరు క్లర్కు మినహా బ్యాంకులోని మిగతా పనివారంతా ఆ రోజుకు పని పూర్తిచేసుకుని విశ్రాంతిగా కూర్చుని వున్నారు గంట ఎప్పుడు అయిదు కొడుతుందా, అని ! లెడ్జెర్ క్లర్కు రాజారావు క్లోజింగ్ బాలెన్ సెస్ వేసుకుంటున్నాడు.

“సార్ ! మేనేజరుగారు పిలుస్తున్నారు.”

రాజారావు లెడ్జెరులోంచి తలపైకెత్తి ప్యూనువంక చూసి “ఎందుకు ?” అన్నాడు. అతనికి సమాధానం చెప్పకుండానే వెళ్ళిపోయాడు ప్యూను. ఆరడుగుల రాజారావు, తనను డిస్టర్బు చేసినందుకు వచ్చిన విసుగును నడకలో చూపిస్తూ పెద్ద పెద్ద అంగలతో మేనేజర్ కాబిన్‌వద్దకు వెళ్ళాడు. ఉన్న పళాన లేచిరావటాన, చేతిలోవున్న పెన్నుకు కాప్‌పెట్టి పాంటు జేబులో పెట్టుకుని ఇన్‌షర్టును సర్దుకుని మేనేజర్ కాబిన్ తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు.

రాజారావును చూసికూడా చూడని వానిలాగా, తన ఎదురుగా కూర్చునున్న

లతను చూస్తూ ఫోనులో మాట్లాడు తున్నాడు మేనేజర్ గోపాలం. మేనేజర్ గోపాలం ఏకైక పుత్రిక లత.

తననే దీక్షగా చూస్తూన్న లతను, టేబుల్ పైనున్న కాగితాలను మార్చి మార్చి చూస్తూ, చేతులు వెనక్కు కట్టు కుని గోపాలం టేబుల్ కు ఒక పక్కగా నుంచున్నాడు రాజారావు.

"ఏమయ్యా! లెడ్జెరు ఇంకా క్లోజ్ చెయ్యలా? ఫోనులో మాట్లాడటం పూర్తి చేసిన గోపాలం వురిమినట్టు అడిగాడు రాజారావును.

"అయిపోవచ్చిందండీ."

"నేను త్వరగా వెళ్ళాలని చెప్పటాన ఆలస్యం చేస్తున్నావా?"

"అబ్బే లేదండీ."

"మరింకేమిటి? సాయంత్రం నాలు గింటికి మా అమ్మాయి వస్తుంది. నేను బైటకు వెళ్ళాలి. ఎకౌంట్సు త్వరగా క్లోజ్ చెయ్యండి అని అందరికీ చెప్ప మని ఎకౌంటెంట్ తో చెప్పాను. అతను నీతో చెప్పలా?"

"చెప్పారండి."

"మరిప్పుడు టయి మెంత అయింది?"

కుడిచేతికున్న వాచీని చూసి "సారీ సర్! మరో రెండు నిమిషాల్లో పని పూర్తయిపోతుంది."

"ఊఁ, త్వరగా కానియ్."

రాజారావు తల నిమురుకుంటూ ఒక సారి లతవంక చూసి కాబిన్ లోనుంచి బైటకు నడిచాడు. అతన్నే చూస్తూన్న లత ఖంగారుగా తన చూపును మరల్చు కుంది.

త్వరత్వరగా లెడ్జర్ క్లోజ్ చేసి గోపాలం దగ్గరకు స్వయంగా లెడ్జరును తీసుకు వెళ్ళాడు రాజారావు. ఎకౌంట్సు సరిగ్గా చూడకుండానే గోపాలం సంత కాలు పెట్టుకుపోసాగాడు. లతనే పరీ క్షగా చూస్తూన్న రాజారావు, గోపాలం లెడ్జెర్ ను చూడడం పూర్తిచెయ్యగానే ఆమెవంక ఒక చిన్న చిరునవ్వు విసి రాడు గోపాలం చూడకుండా! లత కూడా రాజారావును చూసి సిగ్గుతో తల వంచుకుంటూ చిన్నగా నవ్వింది. లత నవ్విన చిరునవ్వుకు సమాధానంగా తన గిరజాల జుట్టును సవరించుకుంటూ బైటకు నడిచాడు రాజారావు. మరికొద్ది క్షణాల్లో మేనేజర్ గారి పైలట్ లా ప్యూను మేనేజర్ బ్రీఫ్ కేస్ పట్టుకు నడుస్తూం డగా అతని వెనక గోపాలం, లతను తీసుకుని ఆఫీసు బైటకు నడిచాడు.

బైటకు వెళుతూ లత చూసిన క్రీగంటి చూపు రాజారావును గిలిగింతలు పెట్టింది.

"బి. ఎ. చదువుతున్నా అచ్చమ్మలా వుందేమిటోయ్ మేనేజర్ కూతురు?" కాషియర్ రవి తన ఎదురుగా కూర్చు నున్న గుమాస్తా సుబ్బారావు తో అన్నాడు.

"ఒరిజినల్‌గా లేని అందం మేకప్ చేసుకుంటే మాత్రం వస్తుందిటోయ్. ఆ రూపంతోపాటు ఆ ఎత్తుపళ్ళు ఆవిడ్ని మర్కటాన్ని చేశాయి" అన్నాడు సుబ్బారావు.

"తండ్రి పోలికలా వుంది కూతురు. అయినా అంత పొట్టిగా వున్నదేమిటోయ్!"

"బిగ్గరగా అనకు, మన మాటలు ప్యూనుగాడు మేనేజరుకు మోసేస్తాడు." సుబ్బారావు మందలించాడు రవిని.

* * *

ఆ రోజు బ్యాంకులో పని చాలా ఎక్కువగా వుంది. తనకిచ్చిన లెడ్జెరులో ఎక్కువ సంఖ్యలో విత్‌డ్రాయల్సు రావటాన రాజారావు చాలా బిజీగా వున్నాడు. అదేసమయంలో ప్యూను వచ్చి "మేనేజర్‌గారు పిలుస్తున్నారు" అని చెప్పాడు.

"ఇదేం మేనేజర్‌రా బాబూ. తనకు సెంట్రల్ ఆఫీసులో బాగా పలుకుబడి వుందిగదా అని అధికారాన్నంతా మన మీదే చూపిస్తున్నాడు" అనుకుంటూ గోపాలంవద్దకు వెళ్ళాడు రాజారావు.

"ఏమిటిసార్ పిలిచారట!"

"ఫోన్ కాల్." పక్కనే పెట్టివున్న రిసీవర్‌ను చూపిస్తూ గోపాలం, రాజారావును పరీక్షగా చూశాడు.

"ఈ సమయంలో ఫోనెవరు చేశారబ్బా! ఇంత పెద్ద బ్యాంకు అంతటికీ ఫోనును ఒక్క మేనేజర్ దగ్గరే వుంచకోకపోతే మరొక ఫోన్ ఏ ఎకౌంటెంట్ దగ్గరో పెట్టించొచ్చుగా. పిసినారి బ్యాంక్ అనుకుంటూ రిసీవర్ చేతిలోకి తీసుకున్నాడు రాజారావు.

"హలో!"

.........

"హల్లో!!"

'రాజారావుగారా?'

"ఎస్ ప్లీజ్."

"సాయంత్రం మిమ్మల్ని పబ్లిక్ గార్డెన్సులో కలవాలనుకుంటున్నాను."

"ఎవరు మాట్లాడుతూంది?"

"ఏం? మీకు తీరికలేదా!"

"అబ్బే ఎందుకులేదు! ఎన్నింటికి రమ్మంటారు?"

'అయిదున్నర'

"అలాగే ఎక్కడ కలవమంటారు?"

"గాంధీ స్టాట్యూ దగ్గర."

"ఓ. కె."

'వుంటాను మరీ. బాయ్, బాయ్.'

"బాయ్, బాయ్."

అయోమయంగా రిసీవర్ హుక్ పెట్టేశాడు రాజారావు.

"ఎవరు ఫోను చేసింది" అన్నట్టు చూశాడు గోపాలం.

ఆ చూపుకు జవాబు ఏమని చెప్పాలో తెలియక మవునంగా తన సీటువద్దకు వచ్చేశాడు రాజారావు.

* * *

"ఫోన్ చేసింది ఎవరోనని బెదిరి పోయారా ?"

"అబ్బే లేదు."

"ఎవరనుకున్నారు?"

"మీరే అయుంటే బాగుంటుందని అనుకున్నాను."

"ఎందుకనో..."

"మీ మీద..."

"ఊఁ, నా మీద—"

"...అభిమానం."

"లౌ ఎట్ ఫస్టు సయిటా !"

"అలాంటిది లాగానే వుంది."

"మీరు చాలా కొంటెగా చూస్తారు."

"మీ కన్నానా !"

"నన్ను 'మీరూ' అనకండి."

"మరి ఏమనమంటారు ?"

"నువ్వు అనండి. లేకపోతే 'లత' అనండి."

"థాంక్యూ."

రాజారావు యింకేమీ మాట్లాడలేక పోయాడు —మేనేజర్ గోపాలం చాలా పలుకుబడి వున్న వ్యక్తి. రేపో మాపో బ్యాంకుకు డైరెక్టరు అయే అవకాశా లున్నాయి. అటువంటి సీనియర్ ఆఫీసర్ కూతురు ఈమె. ఈమెతో ఎలా మాట్లాడినా డేంజరే ! అయినా తనే స్నేహం కోరుతూంది. అదీ ఒకందుకు మంచిదే ! గుమాస్తానయిన నన్ను ఈమె ఎందుకు చేరువు చేసుకుంటూంది ! ఈ విషయం మేనేజర్‌కు తెలిస్తే నన్ను రేపట్నుంచీ ఏదో ఒక వంకతో బ్యాంకులో బాధపెట్టకుండా వుంటాడా ! ...అవకాశాలు మళ్ళీ మళ్ళీ రావట ! వచ్చినప్పుడే సద్వినియోగం చేసుకోవాలి.

"ఏమిటి మాట్లాడకుండా కూర్చున్నావు ?" రాజారావు ఆలోచనల్ని ఆపివేసింది లత.

"ఏం మాట్లాడాలో తెలియటల్లా."

"ఏం, మీకు మాటలు రావా ?"

"ఆడవాళ్ళతో ఇలా మాట్లాడటం నాకు కొత్త."

"నాకు అనుభవం వుందనుకుంటున్నారా ?"

"అబ్బే, అదికాదు."


"మీరు సినిమాలు చూడరా ?"

"ఎందుకు చూడను !"

"మరింకేం అప్పుడిక మాటలకని వెతుక్కోవటం ఎందుకు ?"

లత చొరవకు రాజారావు కొంచెంగా ఆశ్చర్యపోయినా తనూ ఏదేదో మాట్లాడి బాగా చీకటిపడిం తర్వాత ఇంటికి చేరుకున్నాడు

ఒంటరిగా వున్నప్పుడు గర్భవతిలా విశ్రాంతిగా నడిచే సాయంత్రాలు తోడు దొరికితే తేలిగ్గా దొర్లిపోతాయి. అందులోనూ ఆపోజిట్ సెక్సు తోడుగా ఏర్పడితే పరుగులు తీసుకుంటూ పోతాయి. రాజారావుకు సాయంత్రాలు చకచక నడుస్తూన్నట్టు తోచాయి.




ఎంత మహాపట్టణంలోనయినా ఆడా మగ కలిసి తిరిగితే పల్లెటూరికన్న త్వరగా ఆ వార్త పాకిపోతుంది! ఆ జంట ఆఫీసుల్లో పనిచేసే వారయితే ఆ వార్త ఆ ఆఫీసుకు ఉదయానే చేరే న్యూసు పేపరుకన్న ముందుగా చేరుతుంది.

"రాజారావ్ మేనేజరు కూతుర్ని పట్టాడటరోయ్" అంటూ సుబ్బారావు ఒకరోజు రవిచెవిలో వూదాడు. అందుకు తగ్గట్టు లత బ్యాంకుకు వచ్చినప్పుడు ఒకటి రెండుసార్లు రాజారావును కళ్ళతో పలకరించటం బ్యాంకులోని వారంతా చూశారు. కొందరు రాజారావు అదృష్టాన్ని అతనిముందే పొగడటం, మరి కొందరు పిచ్చివాడు, ఆవిడ్లో ఏముందని వెంబడిపడ్డాడు, అని అతని వెనకాల చెప్పుకోవటం బ్యాంకులో మామూలు విషయాలయినాయి.

షికార్లతోనూ, సినిమాలతోనూ, కబుర్లతోనూ మగవాడు కాలం గడిపి ఆనందించ గలిగినంత అతనితో తిరిగే మగువ, అతనితో వివాహం కాకముందు ఆనందించలేదు. లత పరిస్థితి అదే! రాజారావు తానుగా గోపాలాన్ని అడగటానికి అంగీకరించకపోవటంతో తన తండ్రితో 'రాజారావును పెళ్ళిచేసుకోదలచుకున్నాను' అని చెప్పనిశ్చయించుకుంది లత.

* * *

బ్యాంకులో అడుగుపెడుతూనే రాజారావుని తన కాబిన్‌లోకి పిలిచాడు గోపాలం. లత తండ్రితో ఇంటిదగ్గర మాట్లాడివుంటుందని ఊహించిన రాజా

రావు. గోపాలం ఎన్ని తిట్లుతిట్టినా తిన టానికీ, ఎంత అసభ్యంగా ప్రవర్తించినా భరించటానికి సిద్ధమయి మేనేజర్ కాబిన్‌లో అడుగుపెట్టాడు. అధికారికి తలవంచటాన కలిగేది లాభమేనని రాజారావుకు అనుభవంవల్ల తెలుసు.

"రావయ్యా మహారాజా ! కూర్చో." గోపాలం మాటలు ప్రళయానికి నాంది వాక్యాలుగా అనుకున్నాడు రాజారావు. చేతులు కట్టుకుని నుంచుని వుండి పోయాడు.

"లత నిన్ను ప్రేమించిందట ! ఆమెను నువ్వు పెళ్ళిచేసుకుంటా నన్నావట !"

.........

"అలా తలవంచుకుని నుంచుంటా వేమిటోయ్. నేను మేనేజర్‌గా అడగటం లేదు. లత తండ్రిగా అడుగు తున్నాను."

"లతగారు చెప్పారాండీ ?"

"ఇంకా ఆ నక్క వినయం ఎందు కోయ్. నా కూతురికి భర్తను చూడవల సిన బాధ్యత నాకుంది లత తనంతట తనే తన మొగుడ్ని నిర్ణయించుకోవటం వల్ల కట్నం యివ్వవలసిన బెడద తీరి పోయినా, ఒక సామాన్య గుమాస్తా గాడ్కి నా కూతుర్ని యిచ్చి పెళ్ళి చెయ్యటం నాకిష్టంలేదు. నువ్వు ఎంత తెలివితక్కువ వాడివయినా నా పరపతిని ఉపయోగించి నీకు ఆఫీసరు వుద్యోగం మన బ్యాంకులోనే ఇప్పించగలను. ఈ బ్రాంచిలోనే ఆఫీసరుగా వేయిం చటం బాగుండదు. లోకులు నీతో పాటుగా నన్నుకూడా వెక్కిరిస్తారు. కాబట్టి నువ్వు వెంటనే ఒక అప్లికేషన్ హెడ్ ఆఫీసుకు ప్రమోషన్ ఇవ్వమని అడుగుతూ రాసివ్వు."

రాజారావు తలవంచుకునే గోపాలం మాటలు వింటున్నాడు— 'రికమెండేషన్ లేకుండా ఆ బ్యాంకులో ఆఫీసరవటం తనకు సాధ్యంకాదు. తనను తెలివి తక్కువవాడిగానూ పనికిరానివాడిగానూ జమకట్టినా, తన కూతురుకోసరం ఆమెకు కాబోయే భర్తకు ఆఫీసరు ఉద్యోగం యిప్పించటానికి సిద్ధపడు తున్నాడు గోపాలం. అవకాశం జార విడుచుకోకూడదు,' అనుకున్నాడు రాజారావు, మేనేజర్ గోపాలం మాటలకి మనసు చివుక్కుమన్నా !

"ఏమంటావు ?" గోపాలం రెట్టిం చాడు.

"అలాగే సార్." రాజారావు వెంటనే అప్లికేషన్ రాసి యిచ్చాడు.

* * *

"రాజా ! ఉదయం నాన్నగారితో చెప్పేశాను."

"ఏమన్నారు ?"

"'ఆ పనికిరాని వెధవనా నువ్వు పెళ్ళిచేసుకునేది. వద్దు, పొడుగుచూసి

మోజులో పడిపోకు' అన్నారు నాన్నగారు."

"నువ్వేమన్నావ్ ?"

"పనికిమాలిన వాడయినా ఎవడయినా ఫర్వాలేదు. నా కంటికి నచ్చాడు అంతే అన్నాను."

"ఐ. సీ." లతను పేలవంగా చూశాడు రాజారావు.

"నిన్ను బ్యాంకులో ఏమీ అడగలేదా ?"

"అడిగారు. తెలివి తక్కువవాడినయినా, నాకు ప్రమోషన్ ఇప్పిస్తానన్నారు. ఒక గుమాస్తాగాడు తన అల్లుడు కావటానికి వీల్లేదన్నారు. ప్రమోషన్ కోరుతూ అప్లికేషన్ పెట్టమన్నారు."

"పెట్టావా ?"

"ఆఁ."

"ఇంకేం. నీకు ప్రమోషన్ వచ్చినట్టే."

"మీ నాన్నగారు ఎక్కువమంది ఆడపిల్లలకి తండ్రి అయివుంటే బావుండేది."

"ఏం !"

"అల్లుళ్ళు కాబోయే వారందరికీ బ్యాంకులో ఆఫీసరు వుద్యోగాలు దొరికేవి."

"యు సిల్లీ."

"ఏం. మీ నాన్నగారు యిప్పించలేరా ?"

"ఆయన తలుచుకుంటే ఎంతమందికయినా యిప్పించగలరు."

"అదే నేనూ అన్నది."

"నాకు చాలా సంతోషంగా వుంది."

"ఎందుకని?"

"నువ్వు ఆఫీసరువు కాబోతున్నావని."

"గుమాస్తానే అయితే నన్ను పెళ్ళి చేసుకోవా !"

"గుమాస్తావయినా మా నాన్నతో చెప్పి ఆఫీసరుగా చేయగలనన్న ధైర్యం నాకుంది."

"ఐ సీ."

రాజారావు యింకేం మాట్లాడలేదు. ఆ సాయంత్రం అంతటితో ముగిసింది.

* * *

వారంరోజులు తిరక్కముందే రాజారావుకు హెడ్ ఆఫీసునుంచి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్సు వచ్చాయి. ఒక్క ట్రాన్స్‌ఫర్ మాత్రమేకాదు. అదే ఆర్డరులో అతన్ని ఆఫీసరుగా ప్రమోట్‌చేస్తూ మద్రాసు మవుంట్‌రోడ్ బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేశారు.

బ్యాంకులోని వారందరూ రాజారావుకు పట్టిన అదృష్టానికి అతన్ని అభినందించారు. వారిలో కొందరు తమకు ఆ ఛాన్సు దొరికివుంటే బాగుండేదని లోలోపల అనుకున్నారు కూడా !

అభినందన సభ జరిపి రాజారావును మద్రాసుకు సాగనంపారు. అతను మద్రాసుకు వెళుతూంటే రైల్వేస్టేషనుకు వెళ్ళినవారిలో మేనేజర్ గోపాలం, లత,

బ్యాంకులోని మిగతా స్టాఫ్ అంతా వున్నారు.

"నువ్వు చార్జితీసుకున్న వెంటనే ఉత్తరం రాయి. పెళ్ళికి ముహూర్తం పెట్టిస్తాను" అన్నాడు గోపాలం.

"అలాగే సార్" అని వినయంగా జవాబిచ్చాడు రాజారావు.

లత ఎన్నో ఉత్తరాలు రాసినా రాజారావు మద్రాసులో జాయిన్ అయిన ఆరునెలలవరకు ఒక్క ఉత్తరం అయినా రాయలేదు.

ఆ రోజున వచ్చిన పోస్టును చూస్తూ అందులో రాజారావు రాసిన ఉత్తరాన్ని చూసి 'యిన్నాళ్ళ తర్వాత మహారాజుకి జ్ఞాపకం వచ్చామన్నమాట!' అనుకుంటూ ఉత్తరం చదవటం మొదలెట్టాడు గోపాలం-

పూజ్యులు గోపాలంగార్కి,

నేను తెలివితక్కువ వాడ్నయినా, పనికిరాని వాడ్నయినా మీ దయవల్ల ఆఫీసరు నయ్యాను. ఆఫీసరుగా ఆర్నెల్ల నా సర్వీసుకుమెచ్చి ఈ రోజునే నన్ను ఆఫీసరుగా కన్ఫరమ్‌చేస్తూ హెడ్ ఆఫీసునుంచి ఆర్డర్సు వచ్చాయి.

పిల్లల్ని కనటం మనుషుల హక్కు! కానీ, పుట్టిన పిల్లల్ని చంపేహక్కు పుట్టించిన మనుష్యులకే లేదు. అదే మాదిరిగా నాకు ప్రమోషన్ మీరు యిప్పించారు. ఈనాటితో మీరు నన్ను తిరిగి గుమాస్తాగా చేయించగలశక్తిని కోల్పోయారు! కాబట్టి నేను నా ఉద్దేశ్యాన్ని మీకు యివ్వాళ విపులంగా రాస్తున్నాను—నన్ను తెలివిలేనివాడ్నిగా, చేతకాని వాడ్నిగా మీరేకాదు, మీ కుమార్తె లతకూడా పరిగణించింది. నన్ను అలాచూసే మామకు అల్లుడిగా, భార్యకు భర్తగా, వుండవలసిన అగత్యం నాకు లేదు. మీరన్నట్టు, లతకు నా ఆకారంపైననే మోజు. యాక్సిడెంటు వల్లో, వ్యాధివల్లో నేను వికారంగా తయారయితే ఆమె నన్ను ప్రేమించక పోవటమేకాదు, నా బ్రతుకు ఆమె భర్తగా దుర్భరమవుతుంది!-

ఎటువంటివానికైనా మీరు బ్యాంకులో ఆఫీసరు ఉద్యోగం యిప్పించగలరన్న నమ్మకం మీతోబాటు మీ అమ్మాయికి కూడా వుంది. ఇంకో వ్యక్తి మీకు తగిన వాడు మీ అమ్మాయికి నచ్చేవాడు, అల్లుడిగా మీకు దొరక్కపోడు! అందువల్ల మరో అభాగ్యుడికి అవకాశం ఏర్పడుతుంది. నాకు మీరు చేసిన మేలుకు, స్నేహితురాలిగా లత నాకు యిచ్చిన తోడుకు సర్వదా కృతజ్ఞుడ్ని.

ఎప్పుడూ మీ ఆశీర్వచనాలు కాక్షించే-

రాజారావు.

'వంచన! వంచన!! రాస్కెల్. నన్నే వంచించావట్రా!!!' గోపాలం తన క్రింది పెదవిని పై పెదవితో నొక్కుకోవటంతో నెత్తురు వుప్పగా అతని నాలుకకు అంటింది.